# నవ్వాలా... ఏడ్వాలా ?

**మనసు** తెరమీమీద మావయ్య ప్రత్యక్షమైనప్పుడల్లా గుండె గూటిలో మాయదారి గువ్వలు గుసగుసలాడ్తుంటాయి. ఈ లోకంలో ఇంకా ఇలాంటి వారున్నారు గదాని అతలా కుతలమై పోతాను.

మావయ్యంటే... నాకంటే మూరెడో బారెడో పెద్ద అనుకుంటే పప్పులో కాలేసినట్టే. అతడు మా అమ్మకు స్వయానా తమ్ముడు. నాకంటే మూడేళ్లముందు మాత్రమే ఈ లోకంలోకొచ్చాడట. ఆస్తుపాస్తులేవీ మిగల్చకుండా తాతయ్య ముత్తాతల లోకాలకెళ్లిపోయాక మావయ్య చదువు చంకలో పడింది. పొట్టచేత బట్టుకుని అమ్మమ్మతో సహా హైద్రాబాద్ చేరుకున్నాడు. బంధువుల సహాయంతో పెద్ద కిరాణా షాపులో చిన్న గుమాస్తాగా చేరాడు. ఉండేది పాతబస్తీలో. ఉద్యోగం ఉస్మాన్‌గంజ్‌లో. తోటి గుమాస్తాల తెలివితేటల కబ్బురపడి తానూ ఎదగాలనుకున్నాడు. పొట్లాలు కట్టేందుకొచ్చిన చిత్తు కాయితాల్లోంచి సినిమా పత్రిక లేరుకుని తెగ చదివేవాడు. హీరోల ముచ్చట్లు హీరోయిన్ల అచ్చట్లు చదువుతూ ఊహాలోకాల్లో ఉరుకులాడేవాడు.

ప్రతి ఆదివారము సినిమా థియేటర్ల చుట్టూ తిరుగుతూ పోస్టర్లు చూస్తూ పొంగిపోయే వాడు... ఇవన్నీ తనే చెప్పాడోసారి.

నేను ఇంటివద్ద ఉండి ఇంటర్ పాసయ్యాను. ఇంకా చదువుకోవాలనే ఇంటరెస్టుంది. డిగ్రీ హైద్రాబాద్‌లో చదవాలనే ప్రతిపాదన మీద అమ్మానాన్నల మధ్య అదే పనిగా చర్చ జరిగింది. మూడ్రోజుల సుదీర్ఘ తర్కవితర్కాల తర్వాత ప్రతిపాదన పాసయ్యింది. ఎకాఎకిన హైద్రాబాద్‌కు పంపించారు.

మావయ్య ఇంట్లో ఉండడం, అమ్మమ్మ చేతివంట తినడం, రోజూ కాలేజీకెళ్లి రావడం రొటీన్‌గా మారిపోయింది. దిన దిన గండం నూరేళ్లాయుష్షులా గడిపేస్తూ డిగ్రీ ఫైనల్ కొచ్చాను. ప్రభుత్వ ఉద్యోగ సముపార్జనే పరమావధికదా ! పత్రికల్లో వాంటెడ్ కాలమ్స్ చూసి ఉద్యోగాని కప్లై చెయ్యడం సెకండియర్‌లోనే ప్రారంభించాను.

నా కిష్టమున్నా లేకున్నా మావయ్య సినిమా యాక్టర్ల గురించి బోలెడన్ని కబుర్లు చెబుతుండేవాడు. ఆదివారంనాడు నన్ను గూడా థియేటర్లు తిప్పేవాడు. అప్పుడప్పుడు టిక్కెట్టు కొనిచ్చి నన్ను థియేటర్ లోపలికి పంపి తాను ఇంటికెళ్లేవాడు. సినిమా చూసి రాగానే ఊరుకునే వాడా ! ఊహు ! అర్ధరాత్రి దాటేదాకా ఆయనకు సినిమా కథ, సన్నివేశాలు కళ్లకు కట్టినట్టు వినిపించాల్సి వచ్చేది. షురూ నుండి శుభం దాకా పొల్లుబోకుండా చెప్పించుకుని కేరింతలు కొట్టేవాడు. ఆయనడిగిన ఏ ప్రశ్నకైనా సమాధానం చెప్పకపోయినా "నువ్వు సినిమా సరిగా సూడలేదురా. పైసలు దండగైపోయినా"యని రుసరుసలాడేవాడు.

"మరి ... నువ్వే సినిమా సినిమా చూడొచ్చు గదా !" అంటే "ఎందుకూ... పైసలు దండగ" అనేవాడు.

"మరి నేను చూస్తే దండగ కాదా ?"

"కాదు. నువ్వు సినిమా కథ బాగా చెప్తావు. నేను గూడా చూసినట్టే గదా ! ఒక్క టిక్కెట్ మీద ఇద్దరం చూసినట్టే గదా !" అంటూ లౌక్యం బోధిస్తూ సంబరపడిపోయేవాడు. కాని... శతదినోత్సవం సినిమాను తప్పక చూసేవాడు.

పాపం ! చేసేది గుమాస్తా ఉద్యోగం. గొర్రెతోక జీతం. మెగాసిటీలో దగాకోర్ల మధ్య బతకడం, బోలెడన్ని ఖర్చులు. అమ్మమ్మ, తాను, తోడుగా నేను గూడా. నేనంటే మావయ్య కెంత ఇదో ! నన్ను తన మిత్రులకు పరిచయం చేస్తూ...

"వీడు నా స్వంత అక్క కొడుకు, డిగ్రీ చదువుతున్నాడు, రేపు... పెద్ద ఉద్యోగం దొరుకుద్ది మా అల్లుడికి." గర్వంగా చెప్పుకునేవాడు.

ఊహించని విధంగా ఉద్యోగం గురించి నాకో లెటర్ వచ్చింది. ఒరిజనల్ సర్టిఫికెట్స్ పంపమని పోస్టల్ సూపరింటెండెంట్ నిజామాబాదు నుండి వచ్చిందా శుభలేఖ. ఇరానీ హోటల్లో చాయ్ తాగుతూ ఇద్దరు ముగ్గురు మిత్రులకు చెప్పాడా సంగతి.

"ఒరిజనల్ సర్టిఫికెట్లు పోస్టులో మిస్సైతే పరేశాన్ గదా ! నువ్వే స్వయంగా వెళ్లి చూపించి రావా" లని సలహా ఇచ్చారు.

నా గుండెల్లో గుండుసూది గుచ్చుకుంది.

నేనొక్కణ్ణే హైద్రాబాదునుండి నిజామాబాదు కెళ్లిరావాలా !... హమ్మో ... చాలా కష్టం. బస్ చార్జీలు గూడా బాగానే కావాలి. అదే విషయం మావయ్యతో చెప్పాను. ఆయన మురిసిపోయి, "రైల్ల వెళ్లొస్తే తక్కువ చార్జీలు. తప్పకుండా వెళ్లిరావాలి" అన్నాడు.

"గవర్నమెంటుద్యోగం. కాలు మీద కాలేసుకుని బతుకొచ్చు"నని ప్రోత్సహించాడు. మళ్లీ గుండె గుబగుబలాడింది.

"అమ్మో ! ఇంతవరకు నేను రైలెక్కలేదు. మావయ్యా !" బేజారయాను.

"గట్లంటే ఎట్లా ? సినిమాలల్ల చూడలేదా హీరోగాడు రైలు డబ్బాల మీద ఫైటింగులు గూడా చేస్తాడు గదా !" ఫైటింగ్ సీన్ నటించి చూపించాడు. వచ్చిన అవకాశాన్ని వదులుకోవడం అవివేకం. రైలెక్కడం కొత్త అయితే మాత్రం ... నేనేమన్నా పిరికి సన్నాసినా ! మామయ్య మొహంలోకి చూశాను.

"ఇంకేందిరా ! పొద్దున ఐదింటికి రైలుంది. నేనే నిన్ను రైలెక్కించి వస్తాలే". ప్రోగ్రాం ఫైనల్ చేశాడు.

నాలుగింటికే లేచి తయారై మావయ్య వెంట బయలుదేరాను. అన్నట్టూ... అప్పుడు మావయ్య నా డ్రెస్సే వేసుకున్నాడు. సరిగ్గా సరిపోయింది.

కాచిగూడ రైల్ స్టేషన్ అప్పటికే కొమురవెల్లి జాతరలాగుంది.

"నువ్వేం భయపడకు" మని టిక్కెట్టు తెచ్చిచ్చాడు.

రైలొచ్చింది. అది నా గుండెల మీదకే వచ్చినట్టనిపించింది. పిల్లలు, పెద్దలు అంతా ఎక్కేస్తున్నారు. నేనూ ఎక్కేశాను. నన్ను సీటు మీద కూచోబెట్టాడు మావయ్య.

"రైల్ల దొంగనాకొడుకులుంటరు. జెర హుషారుగుండాలే... " హితబోధలు చేస్తున్నాడు. కూత వేసి రైలు కదిలింది. అప్పుడు దిగిపోయాడు.

బోగీ నిండా ప్రయాణీకులున్నారు. నా గుండెగాబరా తగ్గింది. పది గంటలకు నిజామాబాదులో దిగి పోస్టల్ సూపరింటెండెంట్ ఆఫీసుకెళ్లాను. హెడ్ క్లర్క్‌కు లెటర్ చూపించి ఒరిజనల్స్ చూపించబోయాను.

"ఇవన్నీ పోస్టులో పంపాలి. సావకాశంగా చూస్తారు పెద్దాఫీసర్లు. ఆ తర్వాత వెరిఫై చేయిస్తారు. తీసుకెళ్లి పోస్టులో పంపు"మని ఎగాదిగా చూశాడాయన.

ఉసూరుమంది ప్రాణం. చచ్చీచెడి బిక్కుబిక్కుమంటూ ఇక్కడిదాకా వస్తే ఇదా ఫలితం! కోట్ల రూపాయల ఖర్చుతో భారీ సినిమా తీసి కొంపాగోడు అమ్ముకున్న నిర్మాతలాగైపోయాను.

కాళ్లీడ్చుకుంటూ బయటికొచ్చాను. పోస్టాఫీసుకెళ్లి లోకల్ రిజిస్టర్ పోస్టు చేశాను. అంతా అయేసరికి ఒంటిగంట దాటింది. హోటల్లో భోంచేసి బస్సులో తిరుగు ప్రయాణమయాను.

ఏనుగులా వెళ్లి పీనుగులా వచ్చాననుకుంటూ ఇంటికెళ్లాను. రాత్రి ఎనిమిది దాటింది. అమ్మమ్మ బయట అరుగుమీద కూచునుంది. పక్కన పక్క పోర్షన్ల వాళ్లున్నారు. అమ్మమ్మ లేచి ఎదురొచ్చింది.

"మావయ్యేడిరా ?" అడిగింది ఆత్రంగా.

అరే ! వందల కిలోమీటర్లు ప్రయాణించి అలిసిసొలసి ఇంటికొస్తే అప్యాయంగా పలుకరించే బదులు అట్లా అడుగుతుందెందుకో !... అయోమయంలో మునిగాను.

"నాకేందేల్సు ? డ్యూటీకెళ్లి ఇంకా రాలేదా ?" అడిగాను చిరాగ్గా.

"వాడు డ్యూటీకెళ్తే ఎందుకెదిరి చూస్తానురా ? పొద్దున నీతో వచ్చిండుగదా. తిరిగి ఇంటికి రాలేదు నాయనా !" నెత్తి కొట్టుకుంది. "ముందే ఇది పాతబస్తీ. మీ ఇద్దరికి ఏమైందోనని పరేశానైపోతుంది. నువ్వొచ్చినవు. మరి మీ మావయ్యేడీ ?" పక్క పోర్షనామె నిలదీసింది.

"మావయ్య నన్ను రైలెక్కించి వచ్చిండు గదా ?" నోరెల్ల బెట్టాను.

"అయ్యో... నీతో నిజామాబాద్ రాలేదా ? మరైతే ఇంటికెందుకు రాలేదూ ? ఎక్కడికి పోయిండు ? గింత దాకా ఏంజేస్తున్నడు ?" ప్రశ్నల వర్షం కురిసింది.

నేనేం జెప్పాలి ? ఉన్న విషయం మళ్లీ చెప్పాను. వాళ్లంతా నన్ను - హత్య చేసి సాక్ష్యం దొరక్కుండా చేసిన ఖూనీ కోరులా చూస్తున్నారు. "మావయ్యేమన్నా చిన్న పిల్లాడా ? పొద్దున్నే ఇంటికి రాక ఎక్కడి కెల్తాడు ?" తిరిగి ప్రశ్నించాను.

ఆడవాళ్లంతా ముక్కుమీద వేలేసుకున్నారు.

"అయ్యో ! నాకొక్కడే కొడుకురా ! వాణ్ణేం జేసినవురా ? నిజంజెప్పురా ..." అమ్మమ్మ లబోదిబోమంటోంది.

"అదికాదు బాబూ !" మావయ్య కిరాణా దుకాణం యజమాని కం మా పక్కింటాయన నా వీపు నిమురుతూ నీతో పాటు ఆయన నిజామాబాదు వచ్చుండవచ్చు. మీరిద్దరూ కలిసి రాలేదా ?" ఇంటరాగేషన్ ప్రారంభించాడు.

ఆయనను కరకర నమిలి మింగాలనిపించింది.

"మావయ్య నా వెంట నిజామాబాదు రాలేదు మొర్రో అంటే నమ్మరేందీ ? నన్ను రైలెక్కించి, సీటుమీద కూచోబెట్టి తాను రైలు దిగిండు. దుకాణానికి రాలేదా ?"

"దుకాండ్లకొస్తే నేను గిట్లడుగుతానా ?" గుర్రుమన్నాడు. "మీ మావయ్య సత్యకాలం మనిషి. మంచి పనోడు. అతడింటికి రాలేదని మీ అమ్మమ్మ పరేశానైతుందని తెలిసి అప్పుడే దుకాణం బంద్‌జేసి వచ్చిన. మేమంతా మీ కోసమే ఎదిరి చూస్తున్నమయ్యా !"

మావయ్య రైలు దిగి ఎటుబోయినట్టూ ? అప్పటికింకా తెల్లవారలేదు. గల్లీల గుండా గబగబా వస్తుంటే మతోన్మాదులెవరన్నా ... ! ముందే ఇది పాతబస్తీ. గూండాలకు నిలయం. హత్యలంటే బంతులాటలు... వెన్నుపూసలోంచి సన్నని వణుకు బయలుదేరి కాళ్లూ చేతులాడ నివ్వడం లేదు.

అమ్మమ్మ రాగాలు దీస్తూనే ఉంది.

"పాపం ! ముసలమ్మ కొక్కడే కొడుకాయె !"

"గీ పిల్లగాడు శనేశ్వరునోలె దాపురించిండు."

"గంత సదూకున్నోడు. రైలెక్కాలంటే సాయం గావాల్నా !"

ఆడవాళ్ల వ్యాఖ్యానాలు మూతులు తిప్పుళ్లకు మనసు అల్లకల్లోమైంది. జుట్టు పీక్కోవాలని పించింది. ఒళ్లంతా కుళ్లబొడుచుకోవాలన్పించింది. దుకాణం యజమానిని

"పోలీస్ రిపోర్టిద్దామా ?" అడిగాను ఎందుకైనా మంచిదని.

"మీ మావయ్యేమన్నా ఆడపిల్లనా ?" అయినా ఉత్త పోలీస్ రిపోర్టిస్తే చెత్తబుట్ట మింగేస్తది. దాంతోని కొంత పైకమియ్యాలే. నీ దగ్గరెన్ని వేల రూపాయలున్నై ?" ఎకసక్కాలాడాడు.

"నా దగ్గర వేల రూపాయలుంటే మావయ్య నీ దగ్గరెందుకు పంజేస్తడు?" పథేల్మని అడిగెయ్యాలనుకున్నాను.

కాని ... ఈయనది ముందే కోతి గుణం. నేనలాగంటే కొండముచ్చులా గంతులేస్తాడు. ఎందుకీ రాద్ధాంతమనుకుని నోర్మూసుకున్నాను. అర్ధరాత్రి దాటిపోయింది. రసాబాస సాగుతూనే ఉంది.

"సెకండ్ షో సిన్మాగూడా ఐపోయింది. ఇంకేమొస్తడు ? ఇండ్లల్లకు పోండ్రి." దుకాణం యజమాని వెళ్లిపోతూ "నువ్వేం ఫికర్‌జెయ్యకమ్మా రేపు పట్నమంతా వెదుకుదాం." అన్నాడు అమ్మమ్మతో.

నన్నో నేరస్తుడిలా చూస్తూ కదిలారంతా.

రాత్రంతా అమ్మమ్మ కుమిలి కుమిలి ఏడుస్తోంది.

ఇప్పుడు మావయ్యొస్తే ఎంత బావుండు ! ఏదో ఆశ ... రాత్రంతా శివరాత్రైంది.

తెల్లవారింది. పక్క పోర్షన్లవాళ్లు కబురు పెట్టారేమో చుడిబజార్ నుండి చిన్నమ్మ, పంజగుట్టనుండి పెద్దమ్మ భర్తలతో సహా దిగారు. ఆడవాళ్లు శోకాలందుకున్నారు. మరికొందరు బంధువులు మూగారు. అందులో బాగా డబ్బున్న వాళ్లుగానీ, తగినంత లోకజ్ఞానమున్నవాళ్లు గానీ ఎవరూ లేరు.

అంతా కలిసి అమ్మమ్మ నూరడిస్తున్నారు. నన్ను సవాలక్ష యక్ష ప్రశ్నలతో వేధిస్తున్నారు. వీళ్ల తీక్షణ దృక్కులు, శాపనార్థాలు భరించేకంటే పోలీసు స్టేషన్లో లాఠీ దెబ్బలు తిన్నదే నయమనిపించింది.

దుకాణం యజమాని గుమాస్తాలను ఊరంతా తిప్పుతూ వెతికిస్తున్నారు. చిన్నాన్న, పెదనాన్నలు గూడా గాలిస్తున్నారు.

ఎవరు ఎట్లా కబురుచేశారో ఏమోగాని మూడోరోజు అమ్మానాన్నలు ఆఘమేఘాలమీద పరుగెత్తుకొచ్చారు.

అటువైపు అమ్మ, అమ్మమ్మలు ఒకరిమీద ఒకరు వాలి శోకాలు దీస్తుంటే చిన్నమ్మ పెద్దమ్మలు శృతి కలిపారు. ఇటువైపు నాన్న "హైద్రాబాదుల చదువొద్దంటే మీ అమ్మా, నువ్వు విన్నారా ? ఇప్పుడు చూడురా గాడిదా ! మావయ్య నెక్కడన్నా వదిలేసినవా ? లేక హుస్సేన్‌సాగర్ల నూకేశినవా ?" నోటి దురద దీర్చుకుంటున్నాడు. నోరు దెరిస్తే నా వీపు విమానం మోత మోగేట్టుంది. గంటసేపు శోకాల తర్వాత కొంగు బొడ్లో దోపుకుంటూ అమ్మ నా ముందు కొచ్చింది.

"ఏమైందిరా ? నా తమ్ముణ్ణేంజేసినవురా ?" నిగ్గదీసింది. కిక్కురుమనకుండా తల నేలకు వేళ్లాడేశాను. అప్పటికే నాన్న తిట్లతో మొహం వాచిపోయింది. నేనేమన్నా అమ్మ లెంపలు వాయించేట్టుంది.

నాలో సహనం చచ్చిపోయింది. కోపం, ఉక్రోషం ఉబికొస్తున్నాయి. పొత్తి కడుపులోంచి పొంగుకొచ్చిన ఆవేశం గొంతుదాకా వచ్చి, కరిగి నీరై కళ్లద్వారా బయటికొస్తూంది. ఆవేదన భరించలేక చటుక్కున తలపైకెత్తాను. కన్నీటి బిందువులు జలజలా నేలమీద రాలిపడుతున్నై.

"అమ్మా ...!" తటాలున అమ్మ ఒడిలో వాలి బోరుమన్నాను. ఐదారు నిమిషాల దాకా ఏడుస్తూనే ఉన్నాను. నా భుజాలు పొదివి పట్టుకుంది అమ్మ. పక్కకు తీసుకెళ్లి కూచోబెట్టి కొంగుతో కళ్లు అద్ది నుదురు ముద్దాడింది.

"ఏందిరా ? గట్లెందుకురా కన్నా ? ఏమైందో చెప్పు బిడ్డా !" తానూ ఏడుస్తూ తల నిమిరింది. నాన్న గూడా మా పక్కన కూర్చున్నాడు. జరిగిన విషయమంతా పూసగుచ్చినట్టు జెప్పి మళ్లీ బోరుమన్నాను.

"అయ్యో కొడుకా ! ఎంత పనైందిరా ! నీదెంద దురదృష్టంరా !" కొంగుతో కళ్లద్దుకుంటూ ధైర్యం జెప్పింది. వాళ్లమ్మ దగ్గరకు వెళ్లి "దీంట్ల నా కొడుకు తప్పేముందమ్మా? తమ్ముడేమన్నా బుచ్చిపోరడా ? పిచ్చోడు. వీణ్ణి రైలెక్కించి సక్కగ ఇంటికి రావాల్నా... ఎటు

పోయిండో ఏమో ! వాడు ముందే దేడ్ దిమాక్, చూడు... నా కొడుకెంత ఇదైపోతుండో..!" మందలించింది.

"ఆహాఁ !" అమ్మమ్మ గొంతు కీచుమంది. "నీ కొడుకు మంచోడా ? నా కొడుకు పిచ్చోడా ? నా కడుపు కోత నీ కెట్లా తెలుస్తదే !" కొంగునోటి కడ్డం పెట్టుకుని రాగాలాపన శృతి పెంచింది. నాన్న ఏమనుకున్నాడో ఏమో -

"చూడత్తా ! నీ కొడుక్కేమన్నా అయితే నీకు నా కొడుకునిస్తా. కొంచెం ఓపికపట్టు. గిట్లే... నలుగురు నా కొడుకును గదమాయిస్తుంటే వాడు గుండెపల్గిపోతడు మరి..." సముదాయించబోయాడు.

"మీదేం బోయిందయ్యా ?" అమ్మమ్మ గంయ్‌మంది. "మీరంతా బాగానే ఉన్నారు. నా కొడుకు కనబడక మూడ్రోజులైపాయె. వానికేమైందో !... ఎవడన్నా నరికేసిండో... నేనేం జెయ్యాలె దేవుడా !" శృతి పెంచి నేలమీద కూలబడింది. "నీ కొడుకు నీ కెట్లనో నా కొడుకు నా కట్ల గాదా ? కడుపు తీపి మీకే ఉంటుందా ?..." నెత్తి కొట్టుకుంటూ రోదిస్తోంది.

ఛీ ఛీ... నిజామాబాదునుండా లెటర్ రాకున్నా బాగుండేది. ఉద్యోగం వచ్చేదేందో గాని మావయ్య మాయమైపోయిండు. ఇంతకూ మావయ్య ప్రాణాలతో ఉన్నాడా ? ... హడలి పోయాను. రాత్రింబవళ్లు అవే ఆలోచనలు. నా ఫ్రెండ్స్‌తో కలిసి కొన్ని పోలీస్‌స్టేషన్లలో విచారించాను. ఏం లాభం లేదు.

అది... ఆరోరోజు సాయంత్రం...

ఇంటి నిండా విషాదమలుముకునుంది. నన్నసహ్యించుకుంటున్న అమ్మమ్మ బక్కజిక్కి మంచమెక్కింది. అమ్మ, పెద్దమ్మ, చిన్నమ్మ, పక్కపోర్షన్ల ఆడవాళ్లు అదేపనిగా వ్యాఖ్యానాలు విసుర్తూ ముక్కులు ఎగదోసుకుంటున్నారు.

ఆ దృశ్యాన్ని భరించలేక బయట అరుగుమీదికొచ్చి మంచున్నాను. ఆకాశములో పరుగెత్తి అలిసిపోయిన సూర్యుడు పడమటింట్లో ప్రవేశిస్తున్నాడు. ముసలి కిరణాలు మేఘాల మాటున దాక్కున్నాయి. బజార్లో జనాలు, వాహనాలు అదేపనిగా పరుగులు... దృష్టి ఫుట్‌పాత్ మీదుంది.

"గట్ల జూస్తున్నవేందీ ?" నా ముందో ఆకారం, నా డ్రెస్సులో... మట్టిగట్టుకు పోయింది.

ఆఁ... నిజమా ! ఒళ్లు గిల్లుకున్నాను. కలగాదు. నిజమే. సాక్షాత్తూ మావయ్యనే. భక్తుని తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమైన పరమేశ్వరుడిలా కన్పించాడు. అరుగు ఎక్కేశాడు...

"గట్ల ఎటు జూస్తున్నావురా ? నిజామాబాదు నౌకరి సంగతేమైందీ ?" నా భుజమ్మీద చెయ్యేసి కుదిపాడు.

"మ్మా... మా... మ్మావయ్యా !" గొంతు పెగల్లేదు. ఆనందం ఉద్వేగం పట్టలేక గట్టిగా కౌగలించుకున్నాను. చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్లాను.

"అమ్మమ్మా... చూడే అమ్మమ్మా !" గర్వంగా అరిచాను.

అందరి మొహాలు ఆశ్చర్యార్థకాలై పోయినై.

"వచ్చావా నాయనా !" అమ్మమ్మ ఆత్రంగా లేచికూచుంది. ఆమె ఆనందానికవధుల్లేవు. తలపంకించి నవ్వింది. ఒక్క అడుగులో మంచం దిగివచ్చి మావయ్యను ఒడిలో చేర్చుకుంది. ఒళ్లంతా పుణికింది.

ఆడవాళ్ల మొహాలు అరవిరిసిన బంతిపూలై పోయినై.

"చూసినవా అమ్మా ! తమ్ముడొచ్చిండు" అమ్మ మావయ్య చేతులందుకుంది. "నీ కొడుకు నీకు ముట్టిండు. నా కొడుకుకేమీ చెయ్యలేదంటే నమ్మినావా ?" అంది అమ్మమ్మను కొరకొరజూస్తూ. పలుకరింపులు, సాంత్వన వచనాలు ధారావాహికంగా సాగిపోతున్నై. మావయ్య మాత్రం అసలేమీ జరగనట్టు మామూలుగా ఉన్నాడు.

"అక్కలెప్పుడొచ్చిండ్రూ ?" అడిగాడంతే.

"వాణ్ణి రైలెక్కించి నువ్వెటుబోయినవురా ?" అమ్మ అడిగింది.

"వీణ్ణి రైలెక్కించి దిగినగదా !" మావయ్య చెబుతుంటే ఒళ్లంతా చెవులుజేసుకుని వింటున్నారంతా. "గప్పుడే బొంబాయి నుండి రైలొచ్చింది. దాంట్ల నుంచి దిగినోళ్లతోని కలిసి నేను బయటికొస్తున్న. గేటుకాడ టిక్కెట్ అడిగిండ్రు. లేదన్న, ఇప్పుడే వచ్చిన, వెళ్లిపోతున్నాన్న. ఫ్లాట్‌ఫాం టిక్కెట్ చూపించమన్నరు. తీసుకోలేదన్నాను. బొంబాయి నుండి హైద్రాబాద్‌కు డబుల్‌చార్జి కట్టమన్నరు. పైసల్లేవన్నాను. బస్ గంతే... పోలీసుల కప్పజెప్పిండ్రు, వాళ్లు నన్ను వాళ్ల కోర్టుకు దీస్కపోయిండ్రు. అక్కడ ఐదురోజుల జైలు శిక్ష రాసిండ్రు. ఇయ్యాల్ల జైలునుంచి ఇడిచిపెట్టిండ్రు. వచ్చిన. మా జైల్ల... రోజుకు రెండుపూటల భోజనం, చాయ.. "ఖుషీగా చెబుతూ పోతుంటే అమ్మమ్మ గుడ్లు దెరిచింది.

"ఇంక చాల్లే సంబడం..." అంటూ నోరు మూసింది. చేతులు మూతులకడ్డం పెట్టుకుని నవ్వుకుంటున్నారంతా.

మావయ్యను కొరికి పారెయ్యాలన్నంత కోపమొచ్చింది.

"అంత అమాయకత్వం పనికిరాదు మావయ్యా ! వెంటనే మీ దుకాణం సేటుకు ఫోన్ జేస్తే బాగుండేది గదా !" అన్నాను.

మావయ్య నెత్తి గోక్కున్నాడు.

"అర్రెర్రే... నిజమే. కాని ... నా జేబుల ఒక్కపైసా గూడా లేదు తెల్సా ! నౌకరి సంగతేమైందంటే చెప్పవేందీ ?..." ఇంకేవేవో ప్రశ్నలు కుమ్మరిస్తున్నాడు తన సహజ ధోరణిలో.

మావయ్య ధోరణికి నవ్వాలా, నా పరిస్థితికి ఏడ్వాలా అర్థంగాలేదు.

అందుకే మావయ్య గుర్తుకొచ్చినప్పుడల్లా మనసు అతలాకుతలమైపోతుంది.

**3 మార్చి, 2001**

**'ఆంధ్రప్రభ' సచిత్ర వారపత్రిక లో**

**ప్రచురితమైంది.**